సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం ၊ 17 ၊ ఆగస్టు ၊ 2025



పసందైన పాలకోవా
ఉండవల్లి మండలం బొంకూరులో ఓ కుటుంబం ఆరు దశాబ్దాలుగా పాలకోవా తయారు చేస్తూ గుర్తింపు దక్కించుకుంది.
-8లో ▸



జూరాలకు వరద
ప్రియదర్శిని జూరాల జలాశయానికి 95 వేల క్యూసెక్కుల వరద రాగా ఆరు క్రస్ట్ గేట్లు పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.
-8లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /22.6

వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

18 నుంచి సర్వేయర్లకు రెండో విడత శిక్షణ

గద్వాల: లైసెన్స్ సర్వేయర్లకు రెండో విడతలో భాగంగా ఆగస్టు 18వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు, ఈ శిక్షణ 50 రోజుల పాటు ఉంటుందని కలెక్టర్ బీఎం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(తాలిమ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండవ విడతలో ఎంపికైన 130 మంది లైసెన్స్ సర్వేయర్లకు 18 నుంచి అక్టోబర్ 22 వరకు 50 ప్రభుత్వ పనిదినాల్లో శిక్షణ నిర్వహించనున్నట్లు, శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు ఈనెల 18వ తేదీన గద్వాల పాత ఎంపీడీఓ కార్యాలయానికి ఉదయం 10గంటలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని, మొదటి విడతలో శిక్షణ పొంది పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించని లైసెన్స్ సర్వేయర్ అభ్యర్థులు తాము ఫెయిలైన సబ్జెక్టుకు మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నం.9849720811, 9985866499 లను సంప్రదించాలని తెలిపారు.

హిందూధర్మాన్ని కాపాడే బాధ్యత అందరిది



గద్వాలన్యూటౌన్: హిందూదర్మం పటిష్టంగా.. సురక్షితంగా వికాసం చెందినప్పుడే భారత దేశం విశ్వగురువుగా విరాజిల్లుతుందని జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు ఫణి మోహన్‌రావ్ అన్నారు. శనివారం స్థానిక భూలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవాన్ శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్రమైన జన్మాష్టమి రోజు వీహెచ్‌పీ ఏర్పడటం కాకతాళీయం కాదని, భగవత్ సంకల్పమని చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ సంచాలక్ గోపాల్‌రావ్ ఎగ్బోటే వీహెచ్‌పీ స్థాపనలో ఆర్‌ఎస్‌ఎస్ రెండవ సర్ సంఘ సంఘాలక్ గోల్వాల్కర్ గురుజీ చేసిన కృషి, నిర్వర్థించిన భూమికను వివరించారు. విభాగ ప్రచారక్ దేవేంద్ర రాజు మాట్లాడుతూ ప్రతి హిందువు ధర్మ నిష్ట కలిగి సంఘటితమై తమ ధర్మంపై జరుగుతున్న దాడులను, కుట్రలను ఎదుర్కొని తిప్పి కొట్టాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. వెయ్యి సంవత్సరాల క్రితం విదేశీపాలన వల్ల హిందువులలో కలిగిన ఆత్మ విస్మృతి గడిచిన సంవత్సరాల్లో భారతదేశం ఎదుర్కొన్న సమస్యలను వివరించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గద్వాల రాజుల పరాక్రమానికి చిహ్నంగా ఉన్న రామలక్ష్మణ ఫిరంగి ఎదుట వీహెచ్‌పీ జెండా కాషాయధ్వజాన్ని ఎగురవేశారు. కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సహకార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, భజరంగ్ దళ్ సంయోజక్ తిరుపతి మణి సమన్వయం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ఉపాధ్యక్షురాలు శ్రీదేవీ, మమత, విశ్వ సంపర్క్ ఆలూరు రాము, విజయ్‌కుమార్, దేవదాస్, మల్లిఖార్జున్ సాక్రే, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు గురుకులాల్లో స్పాట్ కౌన్సెలింగ్

గద్వాల న్యూటౌన్: జిల్లాలోని కేటీదొడ్డి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 5, 6, 7, 8, 9వ తరగతుల్లో (ఇంగ్లిష్ మీడియం) మిగులు సీట్లకు ఈనెల 18వ తేదీ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని తిరుమల హిల్స్ అప్పన్నపల్లి నందు 18న ఉదయం 10గంటలకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని, గిరిజన విద్యార్థినులకు మాత్రమే సీట్లు ఉన్నాయని, ఎస్టీ ఆర్ఫాన్స్, సెమీ ఆర్ఫాన్స్, పీహెచ్‌సీ క్యాటగిరీలకు చెందిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. విద్యకు సంబంధించి ఆయా ధ్రువపత్రాలు, గురుకులాల్లో సీటు పొంది అడ్మిషన్ తీసుకోని విద్యార్థులు సంబంధిత అలాట్మెంట్ ఆర్డర్ కాపీతో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ సెల్ నం. 7337091015, 7382204326ను సంప్రదించాలని తెలిపారు.

శనేశ్వరాలయానికి భక్తులు

బిజినేపల్లి: ఏలినాటి శనిదోష నివారణ కోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చెరుకుని జ్యేష్టాదేవి సమేత శనేశ్వరునికి తిలతైలాభిషేకం, పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులతో శనిదోష నివారణ కోసం గోత్రనామార్చన, ప్రదక్షిణలు, నందీశ్వర దర్శనం, అన్నప్రసాదం వంటి కార్యక్రమాలు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాంతికుమార్, ఉమా మహేశ్వర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నయా దందా..!

ఫేక్ సర్టిఫికెట్లు, ఫోర్జరీ సంతకాలతో రుణాలు

- ప్రైవేట్ బ్యాంకు సిబ్బంది నిర్వాకం
- రూ.వేల నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్న కమీషన్లు
- అయిజ, గద్వాల, మాన్‌దొడ్డి కేంద్రాలుగా లావాదేవీలు



రాజోళి: డబ్బు వెనకేసుకోవడమే లక్ష్యంగా జిల్లాలో కొందరు ప్రైవేట్ బ్యాంకు సిబ్బంది కొత్త దందాకు తెరలేపారు. మీ పేర్లపై ఆస్తులు లేకపోయినా.. తాతలు, అమ్మనాన్నల పేర్లపై ఉంటే చాలు.. మిగతాదంతా మేమే చూసుకుంటామంటూ నమ్మబలుకుతారు. మా బ్యాంకు ద్వారా రుణం అందిస్తాం.. నువ్వు చేయాల్సిందంతా రుణం మంజూరు కాగానే పర్సంటేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రూ.వేల నుంచి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఇదే అదునుగా స్థానికంగా ఉన్న పైరవీకారులు వారితో కుమ్మక్కై అమాయకులైన పల్లె ప్రజలను రుణాల పేరుతో మోసం చేస్తున్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి..

రుణం పొందేందుకు సరైన పత్రాలు లేకున్నా.. దానిపై మీకు ఎలాంటి హక్కులు ఉన్నాయి, మీ దగ్గర ఉన్న ఏదైనా ఒక కాగితం చూపించండని బ్యాంకు సిబ్బంది వారిని ప్రేరేపిస్తున్నారు. ఉన్న ఒక్క దాన్ని ఆసరాగా చేసుకుని, ఆస్తికి సంబంధించిన అన్ని నకిలీ పత్రాలను వారే తయారు చేస్తున్నారు. ఇవేవి తెలుసుకోకుండా.. అక్రమార్కులకు రూ.లక్షలు కమీషన్ల రూపంలో ఇచ్చి.. అనంతరం రుణ బకాయిలు చెల్లించలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. అలాంటి వారిలో అలంపూర్ మండలం క్యాతూరు గ్రామానికి చెందిన ఒకరు, రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన మరొకరు ఉన్నారు. మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఒక ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి కారణంగా అదే గ్రామంతో పాటు, సమీపంలో ఉన్న పచ్చర్ల గ్రామంలోను అగ్గి రాజేసుకుంది. పచ్చర్లలో నేటికి అన్నదమ్ములు, తండ్రి కొడుకుల మధ్య తగాదాలు జరిగి, పంటను నాశనం చేసుకుని, కేసులు పెట్టుకునే స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం అదే కుటుంబం రెండు వర్గాలుగా ఏర్పడి స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. సదరు వ్యక్తి కారణంగానే మాన్‌దొడ్డిలో రుణం తీసుకుని కమీషన్ ఎక్కువ కావాలని డిమాండ్ చేయడంతో గ్రామ పెద్దలు పంచాయితీ చేసి మందలించినట్లు సమాచారం. కానీ ఆయన తీరు మార్చుకోలేక అయిజలోకి మకాం మార్చి, తన కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇదే వ్యక్తి గట్టు మండలంలో 3, రాజోళి మండలంలో 2, అయిజలో 5, వడ్డేపల్లిలో ఒకటి ఇలా రుణాలు ఇప్పించినట్లు తెలుస్తుంది. ఇవికాక మరికొందరి దగ్గర రుణాల కోసం వేల రూపాయల్లో ముందుగానే డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తుంది.

అధికారులపై అనుమానాలు

జిల్లాలో ఇంత జరుగుతున్నా.. దానికి కారణమైన ప్రైవేట్ బ్యాంక్ సిబ్బంది వివరాలు తెలిసినా అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదనేది చర్చనీయాంశంగా మారింది. వీరు చేసే దందాలో అధికారులకు ఏమైనా పాత్ర ఉందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. గట్టు, రాజోళి మండలాలకు సంబంధించిన ఫోర్జరీ సంతకాలు, ఫేక్ సర్టిఫికెట్లు బయటపడినా సంబంధిత అధికారులు వాటిపై ఎందుకు మౌనంగా ఉన్నారు. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి దందాలను మొదట్లోనే అడ్డుకోకుంటే.. గతంలో జరిగిన నకిలీ పాసు బుక్కుల కుంభకోణం తరహాలో రూ.కోట్ల రూపాయల్లో ఆస్తులకు ఎసరు పెడతారని, జిల్లా అధికారులు వారిపై కఠినమైన చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

> **ఫోర్జరీలకు పాల్పడితే చర్యలు**
>
> **నకిలీ సర్టిఫికెట్లు తయారుచేయడం, సంతకాలు ఫోర్జరీ చేయడం నేరం. రుణాల కోసం ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా** చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఎవరూ కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించొద్దు.
>
> – మొగిలయ్య, డీఎస్పీ

ప్రైవేట్ బ్యాంకు సిబ్బందిదే కీలక పాత్ర

జిల్లాలో ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు కూడా తమ సిబ్బందికి రుణాలు మంజూరు, రీకవరీ పేరిట లక్ష్యాలను నిర్దేశించింది. దీంతో తాము లక్ష్యాలను చేరుకోకుంటే జీతం రాదని తలచిన కొందరు ప్రైవేట్ బ్యాంకు సిబ్బంది.. గ్రామాల్లో డబ్బు అవసరమున్న అమాయకులను లక్ష్యం చేస్తున్నారు. వారికి ఉన్న ఆస్తుల వివరాలను తెలుసుకుని, అందులో ఉన్న లోటు పాట్లను తెలుసుకుని వారే ముందు ఉండి అమాయకులను లోన్ ట్రాప్‌లో దింపుతున్నారు.

నకిలీ పాసుబుక్కుల తరహాలో..

జిల్లాలో నకిలీ పాసుబుక్కుల కుంభకోణం గురించి అందరికీ తెలిసిందే. కొందరు రెవెన్యూ అధికారులు, పైరవీ కారులు, రాజకీయ నాయకులుగా చలామణి అయ్యే వారు నకిలీ పాసు బుక్కులను తయారు చేసి, బ్యాంకుల ద్వారా క్రాప్ లోన్లు, మార్టిగేజ్ లోన్లు తీసుకున్నారు. దీనిపై విచారణ చేయగా రూ.100 కోట్ల స్కాం అని బయటపడింది. ప్రస్తుతం నకిలీ సంతకాలతో చేస్తున్న ఓనర్‌షిఫ్ సర్టిఫికెట్లు కూడా రూ.లక్షలు దాటిపోయినట్లు తెలుస్తోంది. ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఇళ్లకు ఇస్తారు. ప్రస్తుతం జిల్లాలోఎక్కడ కూడా ఇళ్లకు తక్కువ ధర లేదు. దాన్ని అమ్ముకున్నారంటే రూ.లక్షల్లో చేతులు మారి ఉంటాయి. దాని కోసం ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు కావాల్సి ఉంటుంది. ఇలా జిల్లాలో ఎన్ని ఇళ్లు అమ్ముకున్నారు? ఎన్ని నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారనే విషయాలు తెలియాల్సి ఉంది.

ముకుందా.. ముకుందా



సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

- జిల్లాలో కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు
- సద్దలోనిపల్లిలో అంబరాన్నంటిన వైనం



కృష్ణస్వామి మూలవిరాట్



గద్వాలలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడి నామకరణోత్సవం జరిపిస్తున్న భక్తులు

గద్వాల న్యూటౌన్/మల్దకల్: జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. హరేకృష్ణా నామస్మరణలతో జిల్లా కేంద్రం గాంధీచౌక్ సమీపంలోని కృష్ణమందిరం, చెన్నకేశవస్వామి ఆలయం, వేదనగర్‌లోని పాండురంగస్వామి ఆలయం, రాఘవేంద్రకాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయం, మండల పరిధిలోని రేవల్లె, వీరాపురంలలోని శ్రీకృష్ణ స్వామి ఆలయాలు మార్మోగాయి. ఆలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలుచోట్ల నామకరణ, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులను చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలంకరించారు.

సద్దలోనిపల్లిలో..

మల్దకల్ మండలంలోని సద్దలోనిపల్లిలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం భక్తులు కనులపండువగా జరుపుకొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి కొత్తకుండల్లో దాసంగాలు సిద్ధం చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. స్వామి వారి పల్లకీసేవ దశమి కట్ట వరకు భాజాభజంత్రీలతో వెళ్లగా గ్రామస్తులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి జననం, అనంతరం ఉత్సవ మూర్తులతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

క్షయ నివారణ చర్యలపై జిల్లా బృందానికి అవార్డు



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డా. రాజు

గద్వాల క్రైం: క్షయ నివారణ నిమిత్తం 2023లో గద్వాల క్షయ నివారణ బృందం పటిష్ట చర్యలు తీసుకొని 16వేల మంది అనుమానిత వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేపట్టిన నేపథ్యంలో ఉత్తమ అవార్డు వరించింది. శనివారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా జిల్లా క్షయ నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు అవార్డు ఫర్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు. దాదాపు 1500 మందిలో వ్యాధి లక్షణాలు గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించడం, క్షయ రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో వైద్య శాఖ చర్యలు అభినందనీయమని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్ధప్ప, ఇతర వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో వనపర్తి పోలీసుల తనిఖీలు

గద్వాల క్రైం: తాళం వేసిన ఇళ్లు, ఆలయాల్లో కానుకాలు, బంగారు ఆభరణాలు అపహరించిన నిందితుల కోసం శనివారం రాత్రి వనపర్తి జిల్లా పోలీసులు జిల్లాలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవల అక్కడి జిల్లాలోని తాళం వేసిన ఇళ్లలో, ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడి తప్పించుకున్నారు. అయితే నిందితుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన నేపథ్యంలో గద్వాల జిల్లా వైపునకు తప్పించుకుని వచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసు బృందం జిల్లాలో పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై అక్కడి పోలీసులను 'సాక్షి' సంప్రదించగా చోరీలకు పాల్పడిన నిందితులు జిల్లాలో ఉన్నట్లు సమాచారం మేరకు సోదాలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైన అనుమానాస్పదంగా కనిపించిన సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.


ఆదివాసుల హక్కుల కోసం ఉద్యమిద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గద్వాల: ఆదివాసుల హక్కుల కోసం ఉద్యమించి కగార్ హత్యాకాండ-కాల్పుల విరమణపై నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆదివాసుల హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధ్య భారతంలో ఏడు నెలలుగా మావోయిస్టుల ఏరివేతలో భాగంగా అమాయకులైన ఆదివాసులను ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేసి వారిని మావోయిస్టుల ముద్రవేయడం వల్ల వారికి జీవించే హక్కుకు భంగం కలుగుతుందన్నారు. గడ్చిరోలి ప్రాంతంలోరూ.7లక్షల కోట్ల విలువ చేసే ఖనిజ సంపద ఉందని దానిని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే కేంద్రం ఆపరేషన్ కగార్ పేరిట దమణకాండను సృష్టిస్తుందని ఆరోపించారు. దేశంలో మొత్తం 461 ఆదివాసి తెగలు ఉండగా, అందులో 92 తెగలు అడవిపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని, వారి జీవన హక్కులను కేంద్రం ధ్వంసం చేస్తుందన్నారు. తక్షణమే కేంద్రం ఆపరేషన్ కగార్ నిలిపివేసి శాంతిచర్చలు జరిపి అడవులను ఆదివాసుల జీవించే హక్కులను కాపాడుతూ పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 24వ తేదీన వరంగల్‌లోని అంబేద్కర్ భవన్‌లో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో గోపాల్, జ్యోతి, వెంకటమ్మ, శంకరప్రభాకర్, నాగరాజు, సుభాన్, ప్రకాష్‌గౌడ్, ఆంజనేయులు, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజమల్లు

గద్వాల: మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రతలేదని, దాంతో పాటు కనీసం ప్రమాద బీమా కూడ లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జె.రాజమల్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక బృందావన్‌గార్డెన్ ఫంక్షన్ హాలులో జరిగిన మూడో జిల్లా మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జీవితాంతం ప్రజలకు సేవలు అందించే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోగా కనీసం ప్రమాద బీమాను కూడా కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రాజీలేని పోరాటాల ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచి హక్కులు సాధించుకోగలమన్నారు. ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడంతో వైద్యం కోసం సొంత డబ్బులనే వెచ్చిస్తున్నారన్నారు. దీనికోసం అప్పులు సైతం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, వివి నర్సింహా, ఉప్పేర్ నర్సింహా, శివ, రవి, మహేష్, దేవి, లలితమ్మ, సత్యమ్మ, నరేష్, ప్రభుదాసు, సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టం జిల్లా ఇన్‌చార్జ్‌గా రాజశేఖర్

కేటీదొడ్డి: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ఇన్‌చార్జ్‌గా కేటీదొడ్డి మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్‌ను నియమించినట్లు జాతీయ వ్యవస్థాపక చైర్మన్ చంటి ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈమేరకు కమిటీని మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని, కమిటీ ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు రాజశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా

డ్రెయినేజీలో పడి పారిశుద్ధ్య కార్మికుడి మృతి



వనపర్తి రూరల్: మండలంలోని అంకూరులో డ్రెయినేజీలో పడి పారిశుద్ధ్య కార్మికుడు మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ము రాములు(43) గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం గ్రామంలోని రైతువేదిక దగ్గర డ్రెయినేజీని శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు బోర్లపడి ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి కుమారుడు కొమ్ము వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బల్మూర్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ వివరాల ప్రకారం.. మండలంలోని గోదల్ గ్రామానికి చెందిన బాల్‌రాం(78) ఈనెల 13న ఇంట్లోని బాత్‌రూంలో కాలుజారి కిందపడ్డాడు. దీంతో వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహం అందజేశారు. అతని కుమారుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి



అంజలయ్య (ఫైల్)

తిమ్మాజీపేట: విద్యుదాఘాతంతో మండలంలోని మారేపల్లి చెందిన ఇప్పలపల్లి అంజలయ్య (68) మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. అంజలయ్య ప్రతి రోజు తెల్లవారుజామున గ్రామ సమీపంలోని కావేరమ్మ చెరువుకు కాలకృత్యాలకు వెళ్లేవాడు. యథావిధిగా శనివారం కూడా బహిర్భూమికి వెళ్లిన అంజలయ్య దారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి కుప్పకూలిపోయాడు. అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన చిన్నయ్య బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. భార్య బుచ్చమ్మ, ఇద్దరు కుమారులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి చిన్న కుమారుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యశ్రీ అధికారినని బురిడీ

అచ్చంపేట రూరల్: తాము ఆరోగ్యశ్రీ అధికారులమని ఓ మహిళను బురిడీ కొట్టించిన ఘటన అచ్చంపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మధురానగర్ కాలనీకి చెందిన ఓ మహిళకు గత నెలలో కొత్త నంబర్ నుంచి కాల్ వచ్చింది. తాను ఆరోగ్యశ్రీ అధికారినని.. మీకు ఆరోగ్యశ్రీ నుంచి రూ.15వేలు రానున్నాయని చెప్పాడు. నిజమేనని నమ్మిన ఆ మహిళ అతనికి ఓటీపీ చెప్పింది. కాల్ ముగిసిన తర్వాత చూస్తే ఆమె ఖాతాలో రూ.16వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. తిరిగి అతనికి కాల్ చేస్తే కలవలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి శనివారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ విజయభాస్కర్ కేసు నమోదు చేశారు

పసందైన.. పాలకోవా

అలంపూర్/ఉండవెల్లి: ఒక వృత్తి జీవనోపాధికి జీవం పోస్తుంది. అదే వృత్తిలో నైపుణ్యం సాధిస్తే ఆ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు సొంతం అవుతాయి. అది తినబండారమైతే మరింత ప్రాచుర్యం లభిస్తుంది. అందులోనూ మిఠాయి అయితే ఈ ప్రాంతం గురించి చెప్పన్నక్కర్లేదు. అలాంటి పసందైన పాలకోవాకు పెట్టింది పేరుగా ఉండవెల్లి మండలం బొంకూరు పేరొందింది. ఇక్కడ ఆరు దశాబ్దాలుగా ఒక కుటుంబం పాలకోవా తయారీతో గుర్తింపు దక్కించుకుంది. ఒకప్పుడు జీవనోపాధి కోసం పాలకోవాను తయారు చేశారు. ఇప్పటికీ అదే వ్యాపారంలో రాణిస్తూ ఉపాధి పొందుతున్నారు. తెలంగాణ–ఏపీ–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ఉండడంతో ఆయా ప్రాంతాల్లోని పట్టణాల్లో బొంకూరు పాలకోవా ప్రసిద్ధిగాంచింది.

- 60ఏళ్లుగా తయారీ
- మూడు తరాలుగా జీవనోపాధి
- పాలకోవాకు ప్రసిద్ధిగాంచిన బొంకూరు
- మూడు కుటుంబాలకు రోజువారీ ఆదాయం



సిద్ధమైన పాలకోవా



పాలకోవను సిద్ధం చేస్తున్న మహిళ

సండే స్పెషల్

ఆరు దశాబ్దాలుగా తయారీ

గ్రామానికి చెందిన ఒక కుటుంబం పాలకోవా తయారీతో జీవనోపాధి పొందుతుంది. మూడు తరాలుగా ఇదే వ్యాపారంతో ఉపాధి పొందుతున్నారు. పాలకోవా తయారీ ఆ కుటుంబానికి ఉపాధి లభిస్తుండగా ఏళ్ల తరబడి నైపుణ్యం ఆ గ్రామానికే పేరు తెచ్చింది. 60 ఏళ్ల క్రితం సలాం మియ్యా–అమిర్ బీ దంపతులు జీవనోపాధి కోసం పాలకోవా తయారీని ఎంచుకున్నారు. పాలకోవాను తయారు చేసి పట్టణాలకు తరలించి రోజువారీ ఆదాయంతో ఉపాధి లభించింది. ఆ దంపతులకు నజీర్ మియ్యా, కాశీం మియ్యా, శాలిమియ్యా, రసూల్ మియ్యా నలుగురు కుమారులు. వీరిలో పెద్ద కొడుకు నజీర్ మియ్యా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. మిగిలిన ముగ్గురు కుమారులు తండ్రితో కలిసి పాలకోవా తయారు చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయించారు. ఆ తర్వాత కుటుంబాలు వేర్పడినా ఎవరికి వారు పాలకోవాతోనే జీవనం సాగిస్తున్నారు. ఇలా మూడు తరాలుగా పాలకోవా తయారు చేస్తూ అందులో రాణిస్తున్నారు.

నాణ్యతలో రాజీలేకుండా..

మూడు తరా లుగా పాలకోవాతో ప్రసిద్ధి గాంచిన ఆ కుటుంబం నాణ్యతలో రాజీపడకుండా స్వచ్ఛమైన పాలకోవాను తయారు చేస్తున్నారు. పాలకోవాకు పాలపాకెట్లు కాకుండా గ్రామంలో పాడిరైతుల నుంచి బర్రెపాలను సేకరిస్తారు. ఆ తర్వాత కట్టెల పొయ్యిపైనే తయారు చేస్తారు. బర్రెపాల ఖరీదు పెరిగినప్పటికీ తమ లాభాలు తగ్గించుకొని స్వచ్ఛమైన పాలకోవాను సిద్ధం చేస్తున్నారు. పాలకోవ తయారీలో కుటుంబం మొత్తం భాగస్వాములవుతారు.

ఇంట్లో తయారీ.. పట్టణాల్లో విక్రయం

పాలకోవాను ఇంట్లోనే సిద్ధం చేస్తారు. ఉదయం పాలసేకరణ అనంతరం కట్టెలపొయ్యిపైనే పాలకోవాను తయారు చేస్తారు. ఆ తర్వాత కర్నూల్, అయిజ, శాంతినగర్, అలంపూర్ వంటి ప్రాంతాల్లో విక్రయిస్తారు. మిఠాయి, ఇతర దుకాణాలకు సైతం పాలకోవాను సరఫరా చేస్తున్నారు. ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలకోవాను విక్రయిస్తారు. ఇళ్లు అలంపూర్– రాయచూరు రోడ్డుమార్గంలో ఉండడంతో ఈ మార్గాన ప్రయాణించేవారు కొనుగోలు చేస్తారు. పట్టణాల్లో సైతం వీళ్లు తయారు చేసే పాలకోవాను నిరంతరం కొనుగోలు చేసే వినియోగదారులు, ఉద్యోగులు ఉన్నారు.



పాలకోవను డబ్బాలలో నింపుతున్న దృశ్యం

60 ఏళ్ల క్రితం ప్రారంభించాం



60 ఏళ్ల క్రితం నా భర్త సలాం మియ్యా పాలకోవా తయారీని ప్రారంభించారు. వ్యాపారం చేయడానికి డబ్బులు లేవు. దీంతో తక్కువ పెట్టుబడితో ఏదైనా వ్యాపారం చేద్దామని పాలకోవాను తయారు చేశాం. అప్పటి నుంచి పాలకోవాతోనే నా కుమారులు ఉపాధి పొందుతున్నారు. – అమీర్ బీ, బొంకూరు

నాణ్యతగా తరయారు చేస్తాం



మూడు తరాల నుంచి పాలకోవాను విక్రయిస్తున్నాం. మా మామ దీన్ని ప్రారంభించారు. ఆ తర్వాత వారసత్వంగా మేం కొనసాగిస్తున్నాం. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. పాలకోవాకు డిమాండ్ పెరిగిందే తప్పా.. తగ్గలేదు. మా మూడు కుటుంబాలు పాలకోవాతోనే జీవనం సాగిస్తున్నాం. ఎవరికి వారు తయారు చేసుకొని వాటిని విక్రయిస్తుంటారు. – కాశీంబీ, బొంకూరు

పట్టణాల్లో విక్రయిస్తాం



గ్రామంలో పాలకోవా సిద్ధం చేసి కుటుంబ సభ్యులంతా కలిసి కిలో, అర కిలో, పావు కిలో డబ్బాల్లో నింపుతాం. ఆ తర్వాత పెద్ద పట్టణాలు, మిఠాయి దుకాణాలు, హోల్‌సేల్‌గా విక్రయిస్తాం. ఇంటి వద్దకు వచ్చే వారికి పాలకోవా అందుబాటులో ఉంటుంది. – రసూల్ బాషా, బొంకూరు

పీహెచ్‌డీ చేయాలనుకున్నాడు.. కటకటాల పాలయ్యాడు



ప్రొఫెసర్‌పై దాడి వివరాలు వెల్లడిస్తున్న వారణాసి పోలీసులు(ఫైల్)

- ఆధార్ కార్డే భాస్కర్‌ను పట్టించింది
- జూలై 28న ప్రొఫెసర్ రాంచంద్రమూర్తిపై దాడి
- ప్రొఫెసర్ల మధ్య వాగ్వాదమే దాడికి కారణం
- యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థుల నిరసనలు
- దాడి కేసు చేధించిన వారణాసి పోలీసులు

నారాయణపేట: అసలు వారణాసిలో ఏమి జరిగిందంటూ జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయం బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) మరోసారి వెలుగులోకి వచ్చింది. తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ సీఎస్ రామచంద్రమూర్తిపై గత నెలలో జరిగిన దాడి కేసును వారణాసి పోలీసులు సీరియస్‌గా తీసుకొని .. 15 రోజుల్లోనే చేధించారు. ఈ నేపథ్యంలో అసలు ఏమి జరిగిందనే విషయం చర్చనీయాంశంగా మారింది.

అసలు కథ ...

అంతర్గత వివాదమే దాడికి దారి

ప్రొఫెసర్ రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు మధ్య జరిగిన వివాదమే దాడికి దారి తీసిందనేది వారణాసి పోలీసుల విచారణలో వెల్లడైంది. కలత చెందిన మాజీ విభాగాధిపతి తెలంగాణకు చెందిన తన ఇద్దరు పూర్వ పరిశోధన విద్యార్థులు భాస్కర్, మోద్గు కాసిం బాబుకు హెచ్‌ఓడీ తనను వేధిస్తున్నాడని, తనను పని చేయనివ్వడం లేదని తన బాధను వెలిబుచ్చుకున్నాడు. ఈ నేపథ్యంలో వారు ప్రయాగ్‌రాజ్‌లోని మహమ్మద్ కాసీం అనే పరిచయస్తుడిని సంప్రదించారు. ఈ ముగ్గురు కలిసి జూలై 25న వారణాసికి చేరుకొని కాంట్రాక్ట్ నేరస్తులను నియమించుకున్న గణేష్‌పాసిని కలిశారు. బీహెచ్‌యూ క్యాంపస్ వెలుపల ప్రొఫెసర్ మూర్తిపై దాడి చేయడమే అసలు పథకం. ముందుగా క్యాంపస్ లోపల దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ కుదరకపోవడంతో.. కట్‌చేస్తే



భాస్కర్ (ఫైల్)

ప్రొఫెసర్‌పై దాడి జరిగిందిలా..

జూలై 28న సాయంత్రం 6:30 గంటకు ప్రొఫెసర్ మూర్తి క్యాంపస్ నుంచి బ్రిజ్‌ఎన్‌క్లేవ్ కాలనీలోని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు దుండగులు బిర్లా హాస్టల్ క్రాసింగ్ వద్ద ప్రొఫెసర్‌పై కడ్డీలతో దాడి చేశారు. దాడిలో ప్రొఫెసర్ రెండు చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. దాడి అనంతరం దుండగులు హైవేపై పారిపోయారు. స్థానికులు గాయపడిన ప్రొఫెసర్‌ను చికిత్స నిమిత్తం బీహెచ్‌యూ ట్రామా సెంటర్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటు చేశారు.

కటకటాల పాలయ్యాడు

చిన్నప్పుడే భాస్కర్ తల్లిదండ్రులను కోల్పోయాడు. పెద్దనాన్న కిష్టప్ప పోషణలో పెరిగాడు. పీజీ వరకు టాప్ ర్యాంకులో ఉత్తీర్ణుడయ్యాడు. పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో సైతం ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. పీహెచ్‌డీ పూర్తి చేయాలనుకున్న భాస్కర్ విధి రాత.. ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు పెట్టిన ఆశతో కటకటాల వైపు తీసుకెళ్లినట్లు అవుసలోనిపల్లి గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

ఆధార్ కార్డే పట్టించింది

నిందితులను సంప్రదించిన విద్యార్థుల్లో ఒకరైన భాస్కర్‌ను వారణాసి పోలీసులు నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం అవుసలోనిపల్లిలో అరెస్టు చేశారు. అతని ఆధార్ కార్డు వివరాలు వారు బసచేసిన హోటల్ నుంచి వారణాసి పోలీసులు కనుగొన్నారు. ఇదే అతని అరెస్టుకు దారి తీసింది. సీసీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ డేటా, ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ప్రొఫెసర్ రాంచంద్రమూర్తిని చంపడానికి కాదని, బెదిరించడానికే దాడి చేసినట్లు, దాడి చేసే సమయంలో నేను లేను అంటూ భాస్కర్ వారణాసి పోలీసుల విచారణలో చెప్పుకొచ్చినట్లు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కిరాయి హంతకుడు అరెస్ట్

నువావ్ ప్రాంతంలో జరిగిన వాహన తనిఖీల్లో నిందితుడు పాసిని పట్టుకున్నట్లు మీడియా సమావేశంలో డీసీపీ క్రైం శరవణన్ తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా నిందితుడు తుపాకీతో కాల్పులు జరపగా ఎదురు కాల్పుల్లో బుల్లెట్ పాసి కాలికి తగిలి కుప్పకూలినట్లు తెలిపారు. చికిత్స అనంతరం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

అధ్యాపకులు, విద్యార్థుల నిరసనలు

బీహెచ్‌యూ క్యాంపస్‌లో తెలుగు ప్రొఫెసర్‌పై దాడి, అధ్యాపకులు, విద్యార్థుల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. సంఘటన జరిగిన మరుసటి రోజు జూలై 29న ప్రొఫెసర్లు సింగ్ ద్వార్ (ప్రధాన ద్వారం) వద్ద నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు నిరసనకారుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఏసీపీతో సహా సీనియర్ అధికారులు, తక్షణ చర్య తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

జూరాలకు 95వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టు 6 క్రస్టు గేట్ల ఎత్తివేత
- ప్రాజెక్టు నుంచి 80,374 క్యూసెక్కుల నీరు దిగువకు..



జూరాల దిగువ విద్యుత్ కేంద్రం

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 95వేల క్యూసెక్కులకు వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 6 క్రస్టు గేట్లను ఎత్తి 41,112 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 38,879 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, కుడి కాల్వకు 338 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 80,374 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.184 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు ఎగువలో 6 యూనిట్ల ద్వారా 230.683 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 273.706 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఏఈ శ్రీధర్ తెలిపారు.

సుంకేసులకు 32 వేల క్యూసెక్కులు

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 7 గేట్లను తెరిచి 30,653 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. అలాగే కేసీ కెనాల్‌కు 2,180 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అలంపూర్: రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండవగా నిర్వహించారు. అలంపూర్ క్షేత్రంలోని శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామి జోగుళాంబ అమ్మవారి ఆలయ సముదాయంలో వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చక స్వాములు భక్తులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



కర్ణాటకలోని సైదాపూర్ దగ్గర లారీ ఢీ కొట్టడడంతో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- సైదాపూర్ వద్ద కారును ఢీకొట్టిన లారీ
- కర్ణాటక సరిహద్దులో ప్రమాదం
- మాచర్లలో విషాదఛాయలు



మాచర్లకు చెందిన పీజీ రాఘవేంద్ర



మహారాష్ట్రకు చెందిన నాగరాజు

గట్టు: మరో గంటన్నర ప్రయాణిస్తే క్షేమంగా ఇంటికి చేరుకునేవారు. తెల్లారకముందే ఆ ఇద్దరు ప్రాణాలు సిమెంట్ (సిమెంట్ తయారీ కోసం బూడిదను తీసుకెళ్లే లారీ) లారీ రూపంలో గాలిలో కలిశాయి. తెలంగాణ–కర్ణాటక సరిహద్దుల్లో రాయచూర్ జిల్లా పరిధిలోని సైదాపూర్ వద్ద కారును సిమెంట్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మాచర్లకు చెందిన చేనేత వస్త్ర వ్యాపారి పీజీ రాఘవేంద్ర(42)తో పాటుగా ఇదే గ్రామానికి చెందిన అల్లుడు తొడు నాగన్న అలియాస్ నాగేశ్(50)లు మాచర్లకు చెందిన చేనేత కార్మికుడు వస్త్రా వ్యాపారి పీజీ మాసుమన్న, పీజీ రాఘవేంద్ర తండ్రీకొడుకులు సొంతకారులో రెండు రోజుల క్రితం మహారాష్ట్రలోని పూణెకు వస్త్రాల కొనుగోలు కోసం వెళ్లారు. శుక్రవారం వారు తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో మహారాష్ట్రలోని షోలాపూర్‌లో మాచర్లకు చెందిన భార్యాభర్తలు ఈరమ్మ అలియాస్ జయంతి, ఆమె భర్త నాగన్న, అలియాస్ నాగేష్‌లను కారులో మాచర్లకు రావడానికి ఎక్కించుకున్నారు. వారి ప్రయాణిస్తున్న కారు తెలంగాణలోని మక్తల్ నియోజకవర్గం దాటి కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా పరిధిలోని సైదాపూర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ కారును ఢీ కొట్టింది. డ్రైవింగ్ సీటులో ఉన్న రాఘవేంద్ర (42)తో పాటు పక్క సీటులో కూర్చున్న మాచర్ల అల్లుడు నాగేష్(50)అక్కడికక్కడే మృతి చెందారు. కారులో వెనుక సీటులో కూర్చున్న తండ్రి పీజీ మాసుమన్న, జయంతి గాయాలతో బయట పడ్డారు. జయంతికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రస్తుతం ఆమె రాయచూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటనపై కర్ణాటకలోని సైదాపూర్ ఎస్‌ఐ వినయ్‌బడిగేర కేసు నమోదు చేసి మృతదేహాలను రాయచూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాఘవేంద్రకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మహారాష్ట్రకు చెందిన నాగన్నకు ఇద్దర కుమారులు ఉన్నారు. ఈ సంఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

భర్త మరణం భార్యకు తెలియకుండా..

లారీ రూపంలో మృత్యువు కబళించగా, కర్ణాటకలోని సైదాపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో జయంతి భర్త నాగేష్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం జయంతికి తెలియకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. కాళ్లు, చేతులు విరిగి ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోస్టుమార్టం అనంతరం రాఘవేంద్ర మృతదేహాన్ని మాచర్లకు, నాగేష్ మృతదేహాన్ని మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



మృత్యువాత పడిన భాను(ఫైల్)

జడ్చర్ల: రెండు రోజుల కిందట చేపల వేటకు వెళ్లి వరద ప్రవాహంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. పూర్తి వివరాలు.. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బోయలకుంటకు చెందిన భాను(24) మిత్రులతో కలిసి ఈ నెల 14న జడ్చర్ల వంద పడకల ఆసుపత్రి సమీపంలో ఎగువ నుంచి వస్తున్న వరదలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని యువకుడి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఎట్టకేలకు శనివారం సమీప ముళ్ల పొదల్లో యువకుడి మృతదేహం ఉండడాన్ని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గుర్తించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఏడాది కిందటే వివాహమైందని మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీసీఎం బోల్తా.. తప్పిన ప్రమాదం

కొత్తకోట రూరల్: ఓ డీసీఎం అదుపుతప్పి బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన కొత్తకోట మండలం పాలెం సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నుంచి హైదరాబాద్‌కు ఇనుము లోడ్ తీసుకెళ్తున్న వాహనం శనివారం తెల్లవారుజామున పాలెం బ్రిడ్జి సమీపంలోకి రాగానే బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ యాదగిరి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డీసీఎం రోడ్డుకు అడ్డంగా పడటంతో సుమారు గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, హైవే సిబ్బంది వచ్చి వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.



పాలెం సమీపంలో ప్రమాదానికి గురైన డీసీఎం